ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విజయనగరం
జిల్లా వార్తలు
మంగళవారం 26 నవంబరు 2024

29 నుంచి వర్షాలు కురిసే అవకాశం: కలెక్టర్

కలెక్టరేట్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా ఈనెల 29 నుంచి జిల్లాలో వర్షాలు పడే అవకాశం ఉందని కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు. వర్షాల దృష్ట్యా రైతులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. జిల్లాలో వరి కోతలు జరుగుతున్నందున పంట తడిచిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తుఫాన్‌పై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు , అన్ని రకాల ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. అన్ని సమయాల్లో వారికి అందుబాటులో ఉండాలన్నారు.


విజయనగరం:పశుపతినాథేశ్వర స్వామికి పూజలు

హరహర మహాదేవ

కార్తీకమాసం చివరి సోమవారం శివాలయాలు ఓం నమశ్శివాయ నామంతో మార్మోగాయి. కార్తీక దీపాలతో వెలిగిపోయాయి. అభిషేకాలు, పూజలు, ఉపవాసాలతో భక్తులు స్వామిని కొలిచారు. ప్రముఖ శైవ క్షేత్రాలతో పాటు గ్రామాల్లోని ఆలయాలు కూడా భక్తజనంతో నిండిపోయాయి. వేకువజాము నుంచి సాయంత్రం వరకూ బారులుతీరిన భక్తులే కనిపించారు. స్వామికి రుద్రాభిషేకాలు, పంచామృతాభిషేకాలు, విశిష్ట పూజలు చేశారు. పిల్లలు, పెద్దలు ఆలయాల ముందున్న ధ్వజస్తంభాల వద్ద దీపాలు వెలిగించారు. భజన గీతాలు ఆలపించారు.

6లో




విజయనగరం: శివుడి దర్శనానికి భక్తుల బారులు


ఎస్.కోట మండలంలోని ఓ గిరిజన గ్రామం



- చట్టాలున్నా అమలు అంతంతే
- నేటికీ గిరిజనులకు విద్య, వైద్యం, రక్షిత నీరు కరువు
- రహదారులు దుర్భరం ● గ్రామ సచివాలయ సేవలు దూరం

నేడు రాజ్యాంగ దినోత్సవం

గిరి చేరని సంక్షేమం

గిరిజన గ్రామాల్లో నివశిస్తున్న ప్రజలకు రాజ్యాంగపరంగా దక్కాల్సిన సదుపాయాలు ఏ స్థాయిలో అందుతున్నాయో చెప్పేందుకు ఇవే ఉదాహరణలు

- శృంగవరపుకోట మండలం దారపర్తి పంచాయతీలో ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి వెళ్లాలంటే ఒకటి నుంచి రెండు కిలోమీటర్ల దూరం ఉంటుంది. పేరుకే దారపర్తి పంచాయతీ. ఏ పని పడినా సుమారు పది కిలోమీటర్ల దూరం ఉన్న మూలబొడ్డవర పంచాయతీ అమ్మపాలెం రావాల్సిందే. దారపర్తి గ్రామ సచివాలయాన్ని కూడా ఈ గ్రామంలోనే నిర్వహిస్తున్నారు. ఇక్కడకు రావాలంటే కొండలు, గుట్టలు దాటాలి. తమ గ్రామాలకు అందుబాటులో ఉండేలా పల్లపు దుంగాడలో సచివాలయం ఏర్పాటు చేయాలని గిరిజనులు కోరినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు.
- ఎస్.కోట మండలం దారపర్తి పంచాయతీ పరిధిలోని గ్రామాల విద్యార్థులు చదువుకొనేందుకు పల్లపు దుంగాడ, గూనపాడు గ్రామాల పాఠశాలలకు వెళ్లాలి. అక్కడ ఉపాధ్యాయులు కనిపించరు. వారి స్థానంలో ఆయా గ్రామాల్లో చదువుకుని ఖాళీగా వున్న యువతకు ఎంతోకొంత ముట్టజెప్పి చదువు చెప్పిస్తున్నారు. గిరిజనులకు ఆరోగ్యం క్షీణిస్తే డోలీ కట్టుకుని ఆసుపత్రులకు రావాలి.
- శృంగవరపుకోట ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో 3వ తరగతి నుంచి 10వతరగతి వరకు 191 మంది గిరిజన విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ ఆశ్రమ పాఠశాల భవనం చూస్తే విద్యార్థులకు అందుతున్న సంక్షేమం ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు. ఐదేళ్ల తరువాత ఇటీవల దుప్పట్లు అందించారు. కంచాలు, గ్లాసులు, పెట్టెలు వంటివి ఐదేళ్లుగా ఇవ్వలేదు. కిటికీలు పాడయ్యాయి. దోమలు రాకుండా బిగించిన మెస్‌లు ఊడిపోయాయి.
- గంట్యాడ మండలం దిగువ కొండపర్తిగ్రామ సమీపంలో వున్న బీమవరం గిరిజన గ్రామం తాటిపూడి జలాశయానికి ఆనుకుని ఉంది. తాగేందుకు నీరు లేదు. రహదారి సదుపాయం లేదు. ప్రభుత్వ పాఠశాల శిథిలావస్థకు చేరింది.
- ఎస్.కోట మండలం మూలబొడ్డవర పంచాయతీ దంపగుంట గ్రామ చిన్నారులు చదువుకోవాలంటే మూడు కిలోమీటర్ల దూరంలో వున్న కాపుసోంపురం పాఠశాలకు వెళ్లాలి. అది కూడా రాళ్లు, పొదలు దాటుకుని వెళ్లాలి.

శృంగవరపుకోట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రహదారులు, రక్షిత తాగునీరు, విద్య, వైద్యం వంటి మౌలిక వసతులు పొందడం ప్రతి ఒక్కరికీ రాజ్యాంగం కల్పించిన హక్కు. గిరిజనుల కోసమైతే ప్రత్యేక చట్టాలు ఉన్నాయి. ఇన్ని ఉన్నా గిరిజనులు ఇప్పటికీ రాజ్యాంగ పరంగా అందాల్సిన హక్కులకు దూరంగానే బతుకుతున్నారు. కూటమి ప్రభుత్వం ఆ హక్కులు, స్వేచ్ఛను కల్పిస్తుందన్న ఆశతో ఉన్నారు. భారత రాజ్యాంగ పితామహుడిగా పిలిచే బీఆర్ అంబేడ్కర్ 125వ జయంతి రోజున రాజ్యాంగ దినోత్సవంగా నవంబరు 26ను జరపాలని ప్రధాని మోదీ ప్రకటించారు. ఎనిమిదేళ్ల నుంచి దినోత్సవం జరుపుతున్నా అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా గిరిజనుల బతుకులు మాత్రం మారడం లేదు.

ఉమ్మడి జిల్లాలో విజయనగరం మండలం తప్ప మిగిలిన అన్ని మండలాల్లోను గిరిజన జనాభా ఉంది. 1,09,934 మంది పురుషులు, 1,15,622 మంది మహిళలు (మొత్తం 2,25,556 మంది గిరిజనులు) ఉన్నారు. వీరిలో అత్యధిక శాతం అడవులనే నివాసంగా చేసుకొని జీవనం సాగిస్తున్నారు. ఇతరవర్గ ప్రజలతో పోలిస్తే వీరు అనేక రంగాల్లో వెనక బడి ఉన్నారు. మరికొంత మంది మైదాన ప్రాంతాల్లో ఉన్నా మెరుగైన జీవనాన్ని గడిపే పరిస్థితి లేదు. చట్టాలెన్నివు న్నప్పటికీ ఇప్పటికీ రహదారి సదుపాయాలు లేని గ్రామాలకు కొదవలేదు. దీంతో విద్య, వైద్యమే కాదు రక్షిత తాగునీరు సరఫరా చేయలేకపోతున్నారు. మంచి నీరు అందించేందుకు బోర్లు తవ్వాలి. లేదంటే నీటి వనరులున్న ప్రాంతాల నుంచి ప్రత్యేక క్లోరినేషన్ ద్వారా పైపులైను వేయలి. అంతచొరవ తీసుకోవడం లేదు. రహదారులు లేకపోవడంతో వైద్యులు ఈ గ్రామాలకు వెళ్లడం లేదు. ఒకరిద్దరు పారామెడికల్ సిబ్బంది అప్పుడప్పుడు నడిచి వెళ్తున్నారు. గిరిజనులు ప్రాణాల మీదకు వస్తున్నప్పుడు డోలీ కట్టుకొని ఆసుపత్రులకు (మిగతా 8వ పేజీలో...)

గిరిజన చట్టాలు

2006 అటవీ హక్కుల చట్టం, పంచాయతీ నిబంధనల విస్తరణ చట్టం (పీసా), రుణ వ్యాపార నిబంధనలు, అత్యాచార నిరోధక చట్టం, గిరిజనుల భూములను వేరొకరు కొనుగోలు చేయకుండా 1/70 యాక్టు, కోర్టు ఫీజు, దావాల్లో మినహాయింపు చట్టంతో పాటు ఎస్టీ జాతీయ కమిషన్, సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ)లు ఉన్నాయి.

చెలమల నీటిని తాగుతున్నాం



కొండల మధ్య నుంచి వస్తున్న చెలమల నీరు, నేల బావి నీటిని తాగుతున్నాం. ఇంటింటి కుళాయిలను నిర్మిస్తామని చెప్పారు. పైపులు తెచ్చారు. బోరు తవ్వించలేదు. మంచి నీరు లేకపోవడంతో తరచూ రోగాల బారిన పడుతున్నాం.

\- జన్ని లచ్చయ్య, పల్లపు దుంగాడ, ఎస్.కోట

అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం



కూటమి ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధికి కట్టుబడి ఉంది. నాతో పాటు జిల్లాకు చెందిన ఎమ్మెల్యే లంతా శాసన సభలో వీరి సమస్య లను ప్రస్తావించాం. మంత్రి గుమ్మిడి సంధ్యారాణి కూడా హామీ ఇచ్చారు. కొత్తగా ఫీడర్ అంబులెన్స్‌లను ఇస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 50.37 కిలోమీటర్ల పరిధిలో రహదారుల నిర్మాణానికి రూ.52.03 కోట్లు మంజూరయ్యాయి.

\- కోళ్ల లలితకుమారి, ఎమ్మెల్యే, ఎస్.కోట


మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

ధాన్యం సేకరణ లక్ష్యం పెంచుతాం

- రైతు నచ్చిన మిల్లులో విక్రయించుకోవచ్చు
- 48 గంటల్లోనే ఖాతాల్లో నగదు జమ: మంత్రి కొండపల్లి శ్రీనివాస్

గంట్యాడ/గజపతినగరం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ధాన్యం సేకరణ లక్ష్యాన్ని పెంచేలా చర్యలు తీసుకుంటామని మంత్రి కొండపల్లిశ్రీనివాస్ అన్నారు. సోమవారం గజపతినగరం ప్రాథమిక వ్యవసాయ సహకారసంఘం కార్యాలయంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. జిల్లాకు 3.25లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్ణయించినప్ప టికీ అవసరమైతే లక్ష్యాన్ని పెంచాలని అధికారులకు సూచించారు. రైతులు తాము పండించిన పంటను నేరుగా నచ్చిన మిల్లుకు తీసుకువెళ్లి విక్రయించుకోవాలన్నారు. విక్రయించిన 48 గంటల్లోనే వారి ఖాతాల్లో నగదు జమ చేస్తామన్నారు. అవసరమైన గన్నీలను రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సేతు మాదవన్, పౌరసరఫరాలజిల్లా మేనేజర్ మీనాకుమారి, జిల్లా వ్యవసాయాధికారి వి.టి.రామారవు తదితరులు పాల్గొన్నారు.

● గ్రామాల్లో అనర్హులుంటే పింఛన్ తొలగిస్తామని మంత్రి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పెదవేమలి గ్రామంలో రూ.23.50 లక్షలతో నాలుగు పనులకు, లక్కిడాం గ్రామంలో రూ.59.5 లక్షలతో 12 రకాల పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ అర్హులకు తప్పకుండా పింఛన్ అందేలా చర్యలు తీసుకున్నామన్నారు. మూడు నెలలకు ఒకేసారి పింఛన్ తీసుకునే అవకాశం కూడా కల్పిస్తున్నట్లు చెప్పారు. 90 శాతం రాయితీతో గోశాలలను మంజూరు చేస్తున్నామన్నారు. తాటిపూడి రిజర్వాయర్ నుంచి గ్రామాలకు తాగునీరు సరఫరా చేస్తామన్నారు. దురదృష్టవశాత్తు భర్త చనిపోతే ఆ కుటుంబానికి అండగా నిలిచేందుకు వెంటనే వితంతు పింఛన్ మంజూరు చేసేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాస్, తహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి, ఎంపీడీవో రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


6లో

రైల్వే జట్టు విజయం

ఒడిశా క్రికెటర్ స్వస్తిక్ సమాల్ సెంచరీ వృథా

ఆర్టీసీని బలోపేతం చేస్తాం

- విజయనగరం నుంచి పాడేరుకు బస్సు సౌకర్యం
- ఆర్టీసీ జోనల్ చైర్మన్ దొన్నుదొర

విజయనగరం రింగురోడ్డు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీని మరింతగా బలోపేతం చేసి ప్రజా రవాణాను, ప్రయాణాన్ని మరింత సులభతరం చేస్తామని ఆర్టీసీ జోనల్ చైర్మన్ సీయ్యారి దొన్నుదొర అన్నారు. సోమవారం ఉదయం ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయం వద్ద ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, జోనల్ చైర్మన్‌తో ప్రమాణం చేయించారు. అనంతరం దొన్నుదొర మాట్లాడుతూ, ప్రయాణికులకు రక్షణ కల్పించి, ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రయాణం చేసేందుకు వీలుగా చర్యలు తీసుకుంటామన్నారు. విజయనగరం నుంచి అరకు మీదుగా పాడేరుకు బస్సు సౌకర్యం కల్పిస్తామన్నారు. ఈ ప్రాంతం నుంచి పర్యాటకులు, ఉద్యోగులు అరకు, పాడేరు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని, వారికి ఈ బస్సు వల్ల ప్రయాణం సులభతరం అవుతుందన్నారు. ఆర్టీసీలో నష్టాలు తగ్గించేందుకు సంస్థ ఉద్యోగుల సహకారం తీసుకుంటామన్నారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలకు న్యాయం చేసేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తానని తెలిపారు. తనకి ఈ పదవి ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌కు ధన్యవాదాలు తెలిపారు.


బాధ్యతలు చేపడుతున్న దొన్నుదొర

బస్సులను ప్రారంభించిన చైర్మన్ నారాయణ

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో సోమవారం శ్రీకాకుళం-విశాఖ మధ్య నాన్‌స్టాప్‌లుగా నడిపేందుకు వీలుగా రెండు అల్ట్రా డీలక్స్, ఒక ఎక్స్‌ప్రెస్ బస్సులను ఆర్టీసీ రాష్ట్ర చైర్మన్ కొనకళ్ల నారాయణ, జోనల్ చైర్మన్ దొన్నుదొరతో కలిసి ప్రారంభించారు. అనంతరం నారాయణ మాట్లాడుతూ, ప్రయాణికులకు అత్యున్నత సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్, ఆర్టీసీ ఈడీ పి.విజయ్‌కుమార్, జిల్లా ప్రజారవాణాధికారి సీహెచ్ అప్పలనారాయణ, పార్వతీపురం డీపీటీఓ కె.శ్రీనివాసరావు, అనకాపల్లి డీపీటీఓ కె.పద్మావతి, డిప్యూటీ సీటీఓ పీవీ నాగేశ్వరరావు, డిప్యూటీ సీపీఎం సుధాబిందు తదితరులు పాల్గొన్నారు.

● ఆర్టీసీలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఇక్కడికి వచ్చిన చైర్మన్ కొనకళ్ల నారాయణను ఉద్యోగులు కలిసి వినతిపత్రం సమర్పించారు. యూనియన్ నాయకుడు అశోక్ మాట్లాడుతూ, ఆర్టీసీలో థర్డ్‌పార్టీ విధానం రద్దు చేసి అందరికీ నేరుగా సంస్థ నుంచి జీతం వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

● ఆర్టీసీ చైర్మన్, జోనల్ చైర్మన్ రాకతో ప్రింట్, అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు అధిక సంఖ్యలో అక్కడకు చేరుకున్నారు. కవరేజీ కోసం ప్రయత్నిస్తున్న సమయంలో ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది, పోలీసులు హల్‌చల్ చేశారు. కవరేజీకి వెళ్లనీయకుండా దురుసుగా ప్రవర్తించడంతో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు తీవ్ర నిరాశ పడ్డారు.



భూ సమస్యలు పరిష్కారమయ్యే చాన్స్

కూటమి ప్రభుత్వం జూన్ నుంచి ప్రజల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు స్వీకరిస్తోంది. జిల్లాలో దాదాపు ఐదువేల ఫిర్యాదులు వచ్చాయి. అందులో 66 శాతానికి పరిష్కారం చూపించినట్టు ప్రభుత్వం చెబుతోంది. మిగిలిన సమస్యల పరిష్కారం కోసం డిసెంబరు తొలివారం నుంచి రెవెన్యూ సదస్సుల నిర్వహణకు యంత్రాంగం సిద్ధపడుతోంది. ప్రధానంగా గ్రామాల్లో పురోణీలు ఎక్కువగా పెండింగ్‌లో ఉన్నాయి. సర్వే తర్వాత సరిహద్దు తగాదాలు పెరిగాయి. వీటి పరిష్కారంపై దృష్టి పెడితే రైతులకు చాలా మేలు కలగనుంది.

- డిసెంబరు మొదటి వారంలో రెవెన్యూ సదస్సులు
- గ్రామాల వారీగా నిర్వహణ ● ప్రభుత్వం తాజా నిర్ణయం

విజయనగరం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో పెద్ద ఎత్తున భూ ఆక్రమణలు చోటు చేసుకున్నాయి.. బినామీల పేరుతో అడ్డగోలుగా దోచుకున్నారు. దీంతో సామన్య ప్రజలు, రైతులు చాలా ఇబ్బంది పడ్డారు. అందుకనే కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఫిర్యాదులు వెల్లువెత్తాయి. టీడీపీతో పాటు జనసేన పార్టీ కూడా ప్రజాదర్బార్లు నిర్వహించి బాధితుల నుంచి వినతులు స్వీకరించాయి. భూమిని కబ్జా చేశారని ఒకరు, బెరించి లాక్కున్నారని మరికొందరు పెద్ద ఎత్తున ఫిర్యాదుచేశారు. దీంతో రెవెన్యూ సమస్యల పరిష్కారంపై కూటమి ప్రభుత్వం దృష్టిపెట్టింది.

జిల్లాలో 777 పంచాయతీలున్నాయి. పంచాయతీల వారీగా గ్రామ రెవెన్యూ సదస్సులు ఏర్పాటుచేయాలని ప్రభుత్వం భావిస్తోంది. సంబంధిత శాఖలకు చెందిన బృందం ఆ గ్రామాలను సందర్శించి గ్రామసభలను నిర్వహిస్తారు.

భూ ఆక్రమణలు, 22ఏలో ఉన్న భూముల తారుమారు వంటి వాటిపై ప్రత్యేకంగా దృష్టిపెడతారు. వాటిని సరిచేసి బాధితులకు న్యాయం చేస్తారు. సదస్సులపై తొలుత రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు, రైతు సంఘాల ప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ఎంపీలతో కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారు. సన్నాహక సమావేశంలో ప్రభుత్వ ముఖ్య ఉద్దేశాన్ని తెలియజేస్తారు.

నిర్వహణ ఇలా..

గ్రామాల్లో ముఖ్య ప్రదేశాల్లో గ్రామసభలు నిర్వహిస్తారు. సదస్సుకు రెండు రోజుల ముందు గ్రామానికి సంబంధించిన అడంగల్, పహాణీ, ప్రభుత్వ భూ రిజిస్టర్ కాపీలు ముద్రించి వీఆర్వో ప్రదర్శిస్తారు. స్వీకరించిన అర్జీలకు రశీదులు, తక్షణం తీసుకున్న చర్యలకు సంబంధించి నివేదిక అందించాల్సి ఉంటుంది. జిల్లాకు ఒక సీనియర్ ఐఏఎస్ అధికారిని పర్యవేక్షణాధికారిగా ప్రభుత్వం నియమించనుంది. అధికారుల బృందంలో తహసీల్దారు, ఆర్ఐ, సంబంధిత గ్రామాల వీఆర్వో, మండల సర్వేయర్, దేవదాయశాఖ అధికారి, అవసరమైన చోట వక్ఫ్‌బోర్డు అధికారి, రిజిస్ట్రేషన్, అటవీ భూములకు సంబంధించిన అధికారి ఉంటారు. వినతులను అక్కడికక్కడే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారు. పరిష్కరించగలిగిన వాటికి అక్కడికక్కడే పరిష్కారం చూపుతారు. మిగతావి ఉన్నతాధికారులకు చేరవేస్తారు. 45 రోజుల్లో పరిష్కారం చూపించడమే సదస్సుల ముఖ్య ఉద్దేశం.

● వాస్తవానికి ఆగస్టులోనే గ్రామ రెవెన్యూ సదస్సుల నిర్వహణకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. అప్పట్లో ఉద్యోగుల బదిలీలు, రెవెన్యూ సిబ్బంది స్థానచలనం కారణంగా వాయిదా వేశారు. డిసెంబరు మొదటి వారంలో పూర్తిచేయాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. సదస్సులు పూర్తయిన 45 రోజుల్లో సమస్యలకు తప్పకుండా పరిష్కారం చూపించాలను కుంటోంది. కలెక్టర్, జేసీ సైతం సదస్సుల్లో పాల్గొంటారు.



● శివాలయాలకు పోటెత్తిన భక్తులు ● మహిళల ఉపవాస దీక్షలు

హరహర మహాదేవ

విజయనగరం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం చివరి సోమవారం శివాలయాలకు భక్తులు పోటెత్తారు. ఆలయాలన్నీ శివనామంతో మార్మోగాయి. కార్తీక దీపాలతో వెలిగిపోయాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జాము నుంచే శివాలయాల వద్ద భక్తులు అధిక సంఖ్యలో క్యూలో ఉన్నారు. స్వామికి రుద్రాభిషేకాలు, పంచామృతాభిషేకాలు, విశిష్ట అభిషేకాలు నిర్వహించారు. జిల్లా కేంద్రమైన విజయనగరంలోని కోట జంక్షన్‌లో ఉన్న వీర రాజేశ్వరస్వామి కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయం, శివాలయం వీధిలోని ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంతో పాటు రింగురోడ్డులోని పశుపనాథేశ్వర స్వామి ఆలయం, దాసన్నపేట, కొత్తపేట, వీటీ అగ్రహారం, కణపాక, ఇప్పిలివీధి, ఉడాకాలనీ, ఫూల్‌బాగ్ శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నెల్లిమర్ల, ఎస్.కోట ఆలయాల్లోనూ ఇదే పరిస్థితి కనిపించింది. సాయంత్రం కార్తీక దీపాలు వెలిగించారు. ఆయా ఆలయాల ముందు వున్న ధ్వజస్తంభాల వద్ద కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు.



విజయనగరంలో గల జ్ఞాన సరస్వతి ఆలయంలో..



పశుపనాథేశ్వర స్వామి ఆలయంలో భక్తుల పూజలు

త్రివేణిసంగమంలో భక్తుల కోలాహలం



సంగాం ఆలయం వద్ద క్యూలో భక్తులు

వంగర, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కార్తీక ఆఖరి సోమవారం పురస్కరించుకుని పవిత్ర పుణ్యక్షేత్రం సంగాంకు భక్తులు పోటెత్తారు. వేకువజామునే త్రివేణి సంగమ ప్రాంతానికి చేరుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కొందరు నదిలో పిండ ప్రదానం చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది.

పుణ్యగిరి కొండకు భక్తుల తాకిడి

శృంగవరపుకోట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట పుణ్యగిరి కొండకు భక్తులు అధికంగా తరలివచ్చారు. కార్తీక చివరి సోమవారం కావడంతో తెల్లవారుజాము నుంచే బారులుతీరారు. శ్రీదారగంగమ్మలోయ, పుట్టదారల వద్ద స్నానాలు చేసిన అనంతరం ఉమాకోటి లింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు.



ఎస్.కోట: పుణ్యగిరి కొండపై భక్తుల సందడి

పంచముఖేశ్వర స్వామి ఆలయంలో..

సాలూరు రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కార్తీక ఆఖరి సోమవారం సందర్భంగా సాలూరులో పం చముఖేశ్వర ఆలయాన్ని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. మంచాడవలస, పారమ్మకొండ, గుమ్మ లకొండ గుహాలయాల్లో ఉన్న శివలింగాలను భక్తులు దర్శించుకొని అభిషేక పూజలను చేశారు. సాలూరు సంతోషిమాత ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శన మిచ్చారు. వీరబ్రహేంద్రస్వామి, సంతోషిమాత, దుర్గాదే వి ఆలయాల్లో కార్తీక దీపోత్సవాలు నిర్వహించారు.

● మక్కువ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక ఉమా శాం తేశ్వర, మూలక్కాయవలస కాశీ విశ్వేశ్వర, చెముడు భీమలిం గేశ్వర ఆలయాలకు సోమవారం భక్తులు పోటెత్తారు. అన్న సమారాధన నిర్వహించారు.



మక్కువ: ఉమా శాంతేశ్వర ఆలయ కొండపైకి వస్తున్న భక్తులు



సాలూరు రూరల్: సాలూరులో శివదర్శనానికి క్యూలో భక్తులు



పార్వతీపురం టౌన్: ఉమా మార్కండేయ స్వామి ఆలయంలో..



భామిని: ఘనసరలో సామూహిక కుంకుమ పూజలు

పారమ్మకొండను పర్యాటక కేంద్రంగా మారుస్తా



పాచిపెంట: పూజల్లో పాల్గొన్న మంత్రి సంధ్యారాణి, తదితరులు

పాచిపెంట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పార మ్మకొండను పర్యాటక కేంద్రంగా మార్చేందుకు కృషి చేస్తానని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమశాఖ, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. సోమవారం పెదచీపురు వలస సమీపంలో గల పారమ్మకొండ వద్ద నిర్వహించిన శ్రీశివ పార్వతిల కల్యాణంలో ఆమె పాల్గొన్నారు. రహదారి అభివృద్ధి పనులతో పాటు కొండపైకి ఎక్కే మెట్లు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని తెలిపారు. ముం దుగా సుబ్రహ్మణ్యస్వామి, మహాశక్తి, శ్రీచక్రం, శివలింగానికి అభిషేక పూజలు నిర్వహించారు.

రైల్వే జట్టు విజయం

ఒడిశా క్రికెటర్ స్వస్తిక్ సమాల్ సెంచరీ వృథా



దాటిగా బ్యాటింగ్ చేస్తున్న రైల్వేజట్టు బ్యాట్స్‌మన్ వివేక్

విజయనగరం టౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): బీసీసీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సయ్యద్ ముస్తక్ అలీ టీ- 20 దేశవాళీ క్రికెట్ టోర్నీలో ఒడిశా జట్టుపై రైల్వేస్ జట్టు 7 వికెట్ల తేడాతో గెలుపొందింది. విజయనగరం సమీప చింతలవలసలోని డాక్టర్ పీవీజీ రాజు స్పోర్ట్స్ క్రికెట్ మైదానంలో ఒడిశా, రైల్వేస్ జట్ల మధ్య సోమవారం జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచిన రైల్వే జట్టు బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ ప్రారంభించిన ఒడిశా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 194 పరుగుల భారీ స్కోరు సాధించింది. జట్టు ఓపెనింగ్ బ్యాటర్ స్వస్తిక్ సమాల్ చెలరేగి 8 ఫోర్లు, 6 సిక్సర్లతో అద్భుత సెంచరీ (103 పరుగులు) సాధించి జట్టుకు భారీ స్కోర్ అందించాడు. అనంతరం భారీ లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన రైల్వేస్ జట్టు 18.5 ఓవర్లలో కేవలం 3 వికెట్లు నష్టపోయి 198 పరుగులు సాధించి విజయాన్ని అందుకుంది. జట్టు టాపార్డర్ బ్యాటర్లు సామ్రాత్ వ్యాస్ (21 బంతుల్లో 31 పరుగులు), వివేక్ సింగ్ (23 బంతుల్లో 59 పరుగులు), ప్రథమ్‌సింగ్ (44 బంతుల్లో 56 పరుగులు), కెప్టెన్ ఉపేంద్రయాదవ్ (22 బంతుల్లో 46 పరుగులు నాటౌట్) రాణించడంతో లక్ష్యాన్ని సులభంగా ఛేదించింది. ఈ విజయంతో రైల్వేస్ జట్టు ఖాతాలో 4 పాయింట్లు చేరాయి.



సెంచరీ అభివాదం చేస్తున్న ఒడిశా బ్యాట్స్‌మన్ స్వస్తిక్ సమాల్



దాసన్నపేట విద్యుత్ భవనం

వామ్మో.. రూ.కోట్ల బకాయి

● ప్రభుత్వ కార్యాలయాల విద్యుత్ బిల్లుల పెండింగ్

● రూ.119.7 కోట్లు చెల్లించాలంటున్న ఏపీఈపీడీసీఎల్

విజయనగరం రింగురోడ్డు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఏపీఈపీడీసీఎల్‌కు జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు భారీగా బకాయి పడ్డాయి. కోట్ల రూపాయల్లో చెల్లించాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. సామాన్యులు ఒక నెల బిల్లు చెల్లించకుంటే కనెక్షన్ కట్ చేసే విద్యుత్‌శాఖ అధికారులు.. ప్రభుత్వ కార్యాలయాల పట్ల మాత్రం ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. జిల్లాలో అన్ని ప్రభుత్వ శాఖలతో కలుపుకుని రూ.119.70 కోట్ల బకాయిలు ఉన్నాయి. ప్రభుత్వ రంగ కార్యాలయాల వాటి నిర్వహణ, విద్యుత్ బిల్లులకు సంబంధించిన నిధులు సకాలంలో విడుదల చేయక బకాయిలు పెరిగిపోయాయి. సాధారణంగా కార్యాలయాల నిర్వహణకు ప్రతి మూడు నెలలకు ఒకసారి ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావాలి. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ ప్రక్రియలో తీవ్ర జాప్యం జరిగింది. బకాయిలు పూర్తిగా చెల్లించకపోవడంతో కరెంటు బిల్లులు కొండలా పేరుకుపోయాయి.

బకాయిపడిన ప్రభుత్వ కార్యాలయాలు

శాఖ పేరు	బకాయిలు
గ్రామీణ నీటి సరఫరా విభాగం	రూ.53.74 కోట్లు
పంచాతీరాజ్, గ్రామీణాభివృద్ధి	రూ.12.2 కోట్లు
మైనర్ పంచాయతీలు	రూ.11.85 కోట్లు
వైద్య, ఆరోగ్యం, కటుంబ సంక్షేమం	రూ.9.76 కోట్లు
రెవెన్యూ విభాగం	రూ.7.61 కోట్లు
నగరపాలక సంస్థ, మున్సిపాలిటీలు	రూ.5.48 కోట్లు
యూత్ అడ్వాన్స్‌మెంట్, టూరిజం	రూ.3.36 కోట్లు
హోమ్ డిపార్టుమెంటు(హెచ్ఓఎం)	రూ.2.43 కోట్లు
ఉన్నత విద్యాశాఖ	రూ.2.15 కోట్లు
స్కూల్ ఎడ్యుకేషన్	రూ.1.68 కోట్లు

వసూలుకు చర్యలు

ప్రభుత్వ కార్యాలయాల్లో పేరుకుపోతున్న బకాయిల వసూలుకు చర్యలు తీసుకుంటాం. వీటికి మరోసారి నోటీసులు సిద్ధం చేస్తున్నాం. అయితే ప్రభుత్వ కార్యాలయాలకు తగిన నిధులు లేక చెల్లింపుల్లో జాప్యం జరుగుతోంది. బకాయిల నివేదికను ప్రభుత్వానికి పంపిస్తున్నాం. ఇకపై బకాయిల సమస్య లేకుండా స్మార్ట్‌మీటర్లను ప్రభుత్వ కార్యాలయాలకు ఏర్పాటు చేస్తున్నాం.

- ఎం.లక్ష్మణరావు, ఎస్ఈ, ఏపీఈపీడీసీఎల్, విజయనగరం

పది గ్రామాలకు దారేదీ?

● వంతెన నిర్మాణానికి నోచుకోక అవస్థలు

● గెడ్డ పొంగితే ఎక్కడివారక్కడే



వంతెన నిర్మించాల్సిన ప్రదేశం.. వర్షం వస్తే ఇదీ పరిస్థితి

రాజాం రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాజాం మండలంలోని కంచరాం-కొత్త కంచరాం గ్రామాల మధ్య రుద్రసాగరం గెడ్డపై వంతెన నిర్మాణం చేపట్టాలన్న పది గ్రామాల ప్రజల డిమాండ్ దశాబ్దకాలంగా కలగానే మిగిలిపోయింది. సాధారణ రోజుల్లో పెద్దగా ఇబ్బందులు లేకపోయినా వర్షాకాలం, తుఫాన్ వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించే సమయంలో చింతలగెడ్డ పొంగితే ఎక్కడవారక్కడే నిలిచిపోతున్నారు. ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేని పరిస్థితి ఉంటోంది.

జిల్లాలోని తెర్లాం తదితర ప్రాంతాల్లో మిగులు జలాలు పొంగి ప్రవహిస్తూ, గొలుసుకట్టు విధానంలో చెరువుల్ని నింపుతూ రెండు గెడ్డలుగా విడిపోయాయి. వీటిలో ఒకటి రుద్రసాగరం కాగా రెండో ది సారధిగెడ్డ. సారధిగెడ్డ బి.ఎస్.వలస, ఎం.జె.వలస, మారేడుబాక, కొత్తవలస మీదుగా రాజాం, సారధి, అంతకాపల్లి మీదుగా శ్రీకాకు ళం జిల్లాలోని జి.సిగడాం, సంతకవిటి మండలం మీదుగా, పొందూరు మండలంలోని రెల్లిగెడ్డలో కలుస్తోంది.

రుద్రసాగరంగా పిలవబడే చింతల గెడ్డ కొత్తకంచరాం- కొత్త కంచరాం మీదుగా రేగిడి మండలంలోకి ప్రవహిస్తోంది. గతంలో బిటి రహదారి నిర్మాణం సమయంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం గెడ్డపై వంతెనకు బదులు కాజ్‌వే నిర్మాణం జరిపి చేతులు దులుపుకుంది. దీంతో వర్షాకాలంలో చింతగెడ్డ పొంగి కాజ్‌వే పైనుంచి నీరు ప్రవహిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో అటు ఆగూరు, రామినాయుడువలస, దోసరి, అమరాం, కొత్త అమరాంతో పాటు బలిజిపేట మండలంలోని ఉద్దవోలు, సుందరాడ తదితర ప్రాంతాల నుంచి రాజాం వచ్చిపోయే వారంతా ఎక్కడికక్కడ నిలిచిపోవాల్సి వస్తోంది. ఈ ఏడాది సెప్టెంబరులో సంభవించిన తుఫాన్ కారణంగా గెడ్డ తీవ్రంగా ప్రవహించడంతో సుమారు పది గ్రామాల ప్రజలు తీవ్ర అవస్థలకు గురయ్యారు.

వంతెన నిర్మించాలి

కంచరాం-కొత్త కంచరాం గ్రామాల మధ్య చింతలగెడ్డపై కాజ్‌వే స్థానంలో వంతెన నిర్మించాలని కంచరాం, ఆగూరు, దోసరి, రామినాయుడువలస, అమరాం, కొత్త అమరాం, గడిముడిదాం, ఉద్దవోలు, సుందరాడ తదితర గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికే రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్ దృష్టికి సమస్యను తీసుకువెళ్లామని టీడీపీ నాయకులు తెలిపారు.

న్యూస్ బాక్స్

పంచె కట్టుతో పార్లమెంటుకు...

విజయనగరం/రాజాం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు సోమవారం నుంచి ప్రారంభమైన పార్లమెంటు సమావేశాలకు పంచె కట్టుతో సైకిల్‌పై వెళ్లారు. తెలుగుదనం ఉట్టిపడే విధంగా కలిశెట్టి అప్పలనాయుడు పార్లమెంటుకు వెళ్లడం ఇది రెండోసారి.

కార్డులకు దరఖాస్తులు

రాజాం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కొత్తగా రేషన్ కార్డులు కావాల్సిన వారు డిసెంబరు 2వ తేదీ నుంచి దరఖాస్తు చేసుకోవాలని తహశీల్దార్ ఎస్.కృష్ణంరాజు, సీఎస్‌డీటీ చిరంజీవి తెలిపారు. డిసెంబరు 2 నుంచి 28వ తేదీ వరకు గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పాత రేషన్ కార్డుల స్థానంలో కొత్తవి జారీ చేస్తారని తెలిపారు. చేర్పులు, మార్పులకూ అవకాశం ఉంటుందని తెలిపారు.

వాహన తనిఖీలు

నెల్లిమర్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక మిమ్స్ గేటు సమీపంలో నెల్లిమర్ల - విజయనగరం మెయిన్ రోడ్డులో ఎస్ఐ బి.గణేష్ సోమవారం వాహన తనిఖీలు చేపట్టారు. ప్రధానంగా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వారి లైసెన్స్‌లను, వాహనాల రికార్డులను తనిఖీ చేశారు. లైసెన్సు లేకుండా వాహనాలను నడిపితే చట్టపరంగా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఆటో డ్రైవర్లు పరిమిత వేగంతో నడపాలని సూచించారు.

పోస్టులు మంజూరు చేయాలి

బెలగాం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సాలూరు, గుమ్మలక్ష్మీపురంలో ఏర్పాటు చేసిన గర్భిణుల వసతి గృహాల్లో పోస్టులు మంజూరు చేయాలని గిరిజన సంఘం నాయకుడు రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వసతి గృహాల్లోని సిబ్బందితో కలిసి కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణుల వసతి గృహాల్లో పోస్టులు మంజూరు చేసి, తాత్కాలికంగా విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

రైతు శ్రేయస్సే ధ్యేయం

గుర్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రైతు శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని టీడీపీ ప్రభుత్వం కష్టపడి పనిచేస్తుందని విశాఖ డెయిరీ బోర్డు డైరెక్టర్ వి.సన్యాసినాయుడు అన్నారు. సోమవారం తెట్టంగి, కెల్ల, జమ్ముపేట సహకార సొసైటీల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.

రేపు వేలం

విజయనగరం క్రైం, నవంబరు 25: (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల బెవరేజెస్ కార్పొరేషన్ (ఐఎంఎల్) డిపోలో ఉన్న వస్తు సామాగ్రికి ఈ నెల 27న ఉదయం 11 గంటలకు వేలం పాట నిర్వహిస్తున్నట్టు డిపో మేనేజరు గౌరీశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక దాసన్నపేట గ్యాస్ గొడౌన్ వద్ద ఈ వేలం పాట నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఫ్రీజర్లు, ఇన్వర్టర్ విత్ బ్యాటరీ, క్యాష్ చెస్టులు, స్కానర్లు, క్యాష్ కౌంటింగ్ మిషన్లు వేలం వేస్తున్నట్టు తెలిపారు. ఆసక్తి గల వారు రూ.5 వేలు ముందస్తు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని తెలిపారు. వివరాలకు 91219 71887, 94912 44311 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

రుద్రహోమం

కొత్తవలస, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం నాలుగో సోమవారం సందర్భంగా తుమ్మికాపల్లి గేట్ సమీపంలోనున్న ఓం సదనంలో 108 శివలింగాలకు 324 కొబ్బరి కాయలతో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వేదపండితుడు అంపోలు ఉమామహేశ్వర శర్మ, అర్చకుడు కిరణ్ కుమార్ శర్మ పాల్గొన్నారు.

న్యాయం చేయండి

చీపురుపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): 'మా మామ కోడిగుడ్ల మహేష్, బావలు రాజ్‌కుమార్, శ్యామ్‌లు వేధిస్తున్నారని, వాటాగా రావాల్సిన ఆస్తులు మాకు తెలియకుండా విక్రయాలకు పాల్పడుతున్నారని... న్యాయం చేయాల'ని నిమ్మలవలస గ్రామ బాధితులు కోడిగుడ్ల మంజు, ఆమె భర్త కోడిగుడ్ల బాలకృష్ణ ఎస్పీ వకుల్‌జిందాల్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఫిర్యాదు ప్రతులను చీపురుపల్లిలో విలేకరులకు అందజేశారు. ఈ నెల 11న తమను ఇంటి నుంచి బయటికి గెంటి వేశారని, చీపురుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన లేదన్నారు. 15 రోజుల నుంచి తమ కుటుంబం చిన్నపిల్లలతో రోడ్డుపై ఆరుబయట నివాసముంటున్నామని వాపోయారు.

అభినందన

శృంగవరపుకోట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): విశాఖ మెట్రో పాలిటన్ రూరల్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్‌డీఏ) ఛైర్మన్ ప్రణవ్ గోపాల్‌ను ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి బాలాజీ అప్పల రామప్రసాద్‌లు అభినందించారు. సోమవారం ఆయనను కలిశారు.

అవయవ దానంపై అవగాహన

గరివిడి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్‌డీఎస్ కాలేజీలో ఎన్‌సీసీ విద్యార్థులకు మానవీయత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు గోవిందరాజులు సోమవారం అవయవదానంపై అవగాహన కల్పించారు. మనం మరణించినా మన అవయవాలు మరో 12 మంది బతకడానికి ఉపయోగపడతాయన్నారు.

అన్ని రంగాల్లో అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం: మంత్రి



గజపతినగరంలో అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

బొండపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అన్నిరంగాలను అభివృద్ధి చేయాలనే ధ్యేయంతో పని చేస్తోందని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. బి.రాజేరు, కొండకిండాం గ్రామాల్లో వివిధ ప్రభుత్వ భవనాలను సోమవారం ఆయన ప్రారంభించారు. బి.రాజేరులో సచివాలయాన్ని ప్రారంభించారు. అనంతరం గ్రామంలో 20 కుటుంబాలు వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలో చేరాయి. వీరందరికీ ఆయన కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్థికంగా కష్టాల్లో ఉన్నప్పటికీ దీర్ఘకాలికంగా మరమ్మతులకు గురైన రోడ్లు, భవనాలతో పాటు సంక్షేమ పథకాల అమలుకు కృషి చేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా గీతకార్మిక కాలనీలో విద్యుత్ సౌకర్యం మెరుగుపరిచాలని స్థానికులు వినతిపత్రం అందజేశారు. కొండకిండాం గ్రామంలో వెల్‌నెస్ సెంటర్, రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించారు. అనంతరం గెద్దపేట శ్రీభ్రమరాంబికా మల్లికార్జున మాధవ లింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఆలయానికి సీసీ రోడ్డు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కోరాడ కృష్ణ, ఎంపీపీ చల్లా చలంనాయుడు, జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు, కెరటాం, చినతామరాపల్లి సర్పంచ్‌లు నంబూరి రాజేష్ (బుజ్జిరాజు), నడుపూరి భాస్కరనాయుడు, టీడీపీ మండల అధ్యక్షురాలు ముంజేటి పార్వతి, పాసల సీతారాం, జనసేన నాయకులు ఆదాడ మోహనరావు, తహసీల్దార్ డోల రాజేశ్వరరావు, ఎంపీడీవో గిరిబాల తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

గజపతినగరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించి, అభివృద్ధే లక్ష్యంగా పని చేయాలని అధికారులకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ తదితర అంశాలపై చర్చించారు. పురిటిపెంట, గజపతినగరం డంపిగ్ యార్డులకు స్థలాలు సేకరించాలని తహసీల్దార్ బి.రత్నకుమార్‌కు సూచించారు. స్థానిక నాలుగు రోడ్ల జంక్షన్ నుంచి మెంటాడ రోడ్డు వరకు ఆర్ అండ్ బీ పనులను చేపట్టాలన్నారు. జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తన దృష్టికి వచ్చిందన్నారు. అందుకు అవసరమైన పనులు చేపట్టాలన్నారు. అనంతరం పాతబగ్గాంలో 20.5లక్షలతో వెల్‌నెస్ సెంటర్, రూ.25లక్షలతో గ్రామ సచివాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ గుంప్రోతు గోవింద, మాజీ జెడ్పీటీసీ మక్కువ శ్రీధర్, మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, తహసీల్దార్ బి.రత్నకుమార్, ఎంపీడీఓ బి.కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వినతుల స్వీకరణకు హాజరవ్వాల్సిందే: కలెక్టర్



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా వినతుల స్వీకరణకు జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. రెండు జిల్లాల ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్న అధికారులు ఒకవారం విజయనగరం, మరొక వారం రెండో జిల్లాకు హాజరు కావాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ అనుమతి లేనిదే పీజీఆర్ఎస్‌కు గైర్హాజరు కాకూడదని స్పష్టం చేశారు. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. సెలవులకు కూడా అనుమతి తీసుకున్న తర్వాత సంబంధిత ఉన్నతాధికారులకు చెప్పాలని స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యలు పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. సోమవారం ఎటువంటి ఇతర సమావేశాలు, కార్యక్రమాలు నిర్వహించవద్దని తేల్చిచెప్పారు. వినతుల స్వీకరణకు మాత్రమే హాజరు కావాలని ఆదేశించారు. గైర్హాజరైన అధికారులకు మెమోలు జారీ చేయాలని డీఆర్‌వోకి సూచించారు. వినతుల పరిష్కారంలో చిత్తశుద్ధి చూపాలని తెలిపారు.

సమస్యలపై 140 వినతులు

కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వివిధ సమస్యలపై 140 వినతులు అందాయి. కలెక్టర్ అంబేడ్కర్, జేసీ సేతుమాధవన్, డీఆర్‌వో శ్రీనివాస్ మూర్తిలు వీటిని స్వీకరించారు. రెవెన్యూ శాఖకు సంబం ధించి 94 వినతులు, విద్యుత్ శాఖవి 8, పంచాయితీరాజ్ 10, డీఆర్‌డీఏకు 7, మున్సిపాల్టీకి 6, విద్యాశాఖకు 5, వైద్యశాఖకు 2 వినతులు వచ్చాయి.

పోస్టర్ ఆవిష్కరణ

లింగ వివక్షకు వ్యతిరేకంగా రూపొందించిన పోస్టర్‌ను కలెక్టర్ అంబేడ్కర్ సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఆవిష్కరించారు. అమ్మాయిలను, అబ్బాయిలను అన్ని రకాలుగా సమానంగా చూస్తామని అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ నెల 25 నుంచి డిసెంబరు 23 వరకూ వివిధ ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

శక్తి సదనాలు ఉపయోగపడాలి

జిల్లాలో ఏర్పాటు చేసిన శక్తిసదనాల ద్వారా బాధిత మహిళలకు ఆశ్రయం కల్పించడం , వారికి అవసరమైన ఉపాధి కల్పించే కార్యక్రమాలను చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అత్యాచార కేసుల్లో బాధితులైన మహిళలకు ఈ సదనాల్లో చేర్పించి... జీవనోపాధికి దారి చూపించేలా ఉండాలని చెప్పారు. శక్తిసదనాలు మరోఏడాది పాటు కొనసాగించే అంశంపై పరిశీలనకు ఇద్దరు అధికారులతో కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

ప్రారంభించని పనులు రద్దు

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన సీసీరోడ్లు, ఇతర పనులను ప్రారంభించేందుకు ఈనెల 26వ తేదీ (మంగళవారం) వరకూ గడువు ఉందని కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు. అప్పటికి పనులు ప్రారంభించకపోతే రద్దు చేయాలని ఆదేశించారు. ఇంకా సుమారు 283 పనులను ప్రారంభించాల్సి ఉందని చెప్పారు. సంబంధిత అధికారులతో తన చాంబర్‌లో సోమవారం కలెక్టర్ సమీక్షించారు. సుమారు రూ.180 కోట్ల విలువైన పనులను మంజూరు చేయగా, ఇప్పటి వరకూ కేవలం రూ.89 కోట్లు బిల్లులు మాత్రమే అప్‌లోడ్ చేయడంపై అసహనం వ్యక్తం చేశారు. ప్రతి రోజు 25 శాతం సచివాలయ సిబ్బంది విధులకు గైర్హాజరు అవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీవోలు సచివాలయాలను తనిఖీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

వినతులు పరిష్కరించాలి

భూముల రీసర్వే సందర్భంగా నిర్వహించిన గ్రామ సభల్లో ప్రజల నుంచి వచ్చిన వినతులను వెంటనే పరిష్కరించి పీజీఆర్ఎస్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టరు అంబేడ్కర్ తెలిపారు. తహసీల్దారులు, సర్వేయర్లతో సోమవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో జేసీ సేతు మాధవన్, డీఆర్‌వో శ్రీనివాసమూర్తి, సర్వే శాఖ ఏడీ రమణమూర్తి పాల్గొన్నారు.

లింగ వివక్ష తగదు: ఎమ్మెల్యే

డెంకాడ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): లింగ వివక్ష తగదని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి అన్నారు. చొల్లంగిపేట గ్రామం లో జెండర్ క్యాంపె యిన్ 3.0 కార్యక్రమాన్ని సోమ వారం ఆమె ప్రారం భించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లింగవివక్ష ,బాల్య వివాహాలు, గృహహింసకు వ్యతిరేకంగా పోరాడాలని మహిళా సంఘాలకు పిలుపునిచ్చారు. మహిళలకు అవసరమైన హెల్ప్‌లైన్ నెంబర్ల గురించి తెలియజేశారు. ఇది చైల్డ్ లైన్ 1098, పోలీసు 100, అంబులెన్స్ 108 , నేర నిరోధాలకు 1098, మహిళలు ,పిల్లలపై వేధింపులపై 1091 నెంబర్లకు ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, ఏపీఎం శ్రీనివాస్, జనసేన మండల కోఆర్డినేటర్ పైల శంకర్‌రావు, జనసేన ప్రతినిధి రామ్, ఎంపీటీసీ సభ్యుడు కిరణ్, డి.కొల్లాం, సర్పంచ్ శివ, సర్పంచ్ కోరాడ కనకరాజు జనసేన నాయకులు రమేష్, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతపై అవగాహన

పిల్లల దోపిడీ, అకృత్యాలు, మహిళలపై హింసపై లెండి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎన్.రవితేజ, ఫెమినా వింగ్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.జానకి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించాజు కళాశాల ప్రిన్స్‌పాల్ డాక్టర్ వీవీ రామారెడ్డి, ఛైర్మన్ పి.శ్రీనివాసరావు, వైస్ ఛైర్మన్ కె .శివరామకృష్ణ, సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ టి.హరిబాబు, వైస్ ప్రిన్స్‌పాల్ పీడీ శైలజ, తదితరులు పాల్గొన్నారు.

బర్లపేటలో రోడ్డు పనులపై వివాదం

నెల్లిమర్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గుషిణి పంచాయితీ బర్లపేట గ్రామ పరిధిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు అడ్డుకున్నారు. ఈ రోడ్డు పనులను జనసేన నాయకుడు చేపట్టడం వల్లనే అడ్డుకుంటున్నామని టీడీపీ నాయకులు స్పష్టం చేసినట్లు తెలిసింది. దీంతో పనులు నిలిచిపోయాయి. దీనికి టీడీపీ, జనసేన వర్గాల మధ్య నలుగుతున్న వివాదమే కారణంగా తెలుస్తోంది. ఈ నెల 26వ తేదీలోగా ప్రారంభించకపోతే పనులు రద్దు చేయనున్నట్టు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో పనిని చేపడుతున్న జనసేన నాయకుడు దురగాసి శేఖర్‌కు సోమవారం ప్రారంభించారు. విషయం తెలిసిన టీడీపీ నాయకుడు చందక నారాయణరావు, మరి కొంతమంది జేసీబీని అడ్డుకున్నారు. దీనిపై కాంట్రాక్టర్ దురగాసి శేఖర్ టీడీపీ నాయకులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వైద్య సౌకర్యాలు పూర్తి స్థాయిలో కల్పించాలి

జియ్యమ్మవలస, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రావాడ రామభద్రపురం పీహెచ్‌సీ పరిధిలోని గిరిజనులకు వైద్య సౌకర్యాలు పూర్తిస్థాయిలో అందించాలని సీపీఎం, ఆదివాసీ, గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం నాయకుడు కె.గంగునాయుడు, ఆదివాసీ, గిరిజన సంఘాల నాయకులు కె.సీతారాం, జి.సోమయ్య, బలరాం, సుబ్బారావు, బొంకయ్య రావాడ రామభద్రపురం పీహెచ్‌సీని పరిశీలించారు. ఈసందర్భంగా వీరు మాట్లాడుతూ పీహెచ్‌సీలో సిబ్బంది పూర్తిస్థాయిలో ఉండడం లేదని ఆరోపించారు.

నివేదికలు ఇవ్వండి

రాజాం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మినీ గోకులాలు ఎంతమందికి అవసరమన్న విషయంపై సర్వే చేసి నివేదికలు ఇవ్వాలని ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు ఆదేశించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయితీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం గోకులాల నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఎంతమంది పాడిరైతులకు అవసరం అవుతుందో గుర్తించాలన్నారు.

ఆలయానికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న కర్రోతు బంగార్రాజు

భోగాపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): చాకివలస గ్రామంలో నిర్మిస్తున్న శ్రీసీతారాముల ఆలయ నిర్మాణానికి ఏపీ మార్క్‌ఫెడ్ ఛైర్మన్, నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు రూ.లక్ష విరాళంగా అందించారు. సోమవారం పోలిపల్లిలోని తన నివాసంలో కమిటీ సభ్యులకు ఈ మొత్తాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లంక రామనర్సి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లకు అనుమతించండి

శృంగవరపుకోట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట పుణ్యగిరి కాలనీ గృహాలకు రిజిస్ట్రేషన్లు చేయాలని జనసేన నాయకుడు ఒబ్బిన సన్యాసినాయుడు కోరారు. ఈమేరకు సోమవారం రెవెన్యూ అధికారులకు వినతిపత్రం సమర్పించారు.

క్రైం కార్నర్

ఉపాధి కోసం వెళుతూ..

● వ్యాన్ బోల్తా పడి ఒకరి మృతి ● 25 మందికి గాయాలు



బోల్తా పడిన వ్యాను, క్షతగాత్రులు

సాలూరు రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సాలూరు మండలం కొఠియా గ్రూపు గ్రామం కుంబిమడ వద్ద వ్యాను బోల్తా పడిన ఘటనలో ఒకరు మృతి చెందగా, 25మందికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రం కొరాపుట్ జిల్లా నందపూర్ బ్లాక్ కిణుబూర్ పంచాయతీ కొన్న గ్రామానికి చెందిన గిరిజన కూలీలు వ్యవసాయ పనుల కోసం విజయవాడ బయలుదేరారు. వారంతా ఒక వ్యానులో సాలూరు వస్తున్నారు. సాలూరు మండలం జీగిరాం వద్ద ఉన్న బస్సులో వారు విజయవాడకు వెళ్లాల్సి ఉంది. వారి వ్యాను పొట్టంగి మీదుగా వస్తుండగా కుంబిమడ సమీపంలో బ్రేక్ ఫెయిల్ కావడంతో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో 25 మంది గాయపడ్డారు. వారిలో తీవ్రంగా గాయపడిన సబిత కిలో(19) అనే యువతి పొట్టంగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. మరో యువతి కుమారి పరిస్థితి విషమంగా ఉంది. పొట్టంగి ఆసుపత్రిలో క్షతగాత్రులు చికిత్స పొందుతున్నారు. గాయపడిన వారిలో ముగ్గురు క్షతగాత్రులను కొరాపుట్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కొఠియా పోలీసులు కేసు నమోదు చేస్తున్నారు.

కూలి పనికి వెళ్లి..



మహేష్(ఫైల్)

రేగిడి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కూలిపనికి వచ్చిన ఒక వెల్డర్ విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడ్డాడు. పనసలవలస గ్రామంలో సోమవారం ఈఘటన చోటుచేసుకొంది. పోలీసులు, స్థానికులు, పోలీసుల కథనం మేరకు వివరాలివీ.. విజయనగరం మండలం జమ్మునారాయణపురం గ్రామానికి చెందిన యడ్ల మహేష్(49) పనసలవలసలో మరో ముగ్గురితో కలసి ఇంటి నిర్మాణ పనుల్లో పాల్గొంటున్నాడు. ఈ ఇంటి రెండో ఫ్లోర్‌లో సోమవారం వెల్డింగ్ చేస్తుండగా... పక్కనే ఉన్న విద్యుత్ తీగలు తగిలి మహేష్ తీవ్రంగా గాయపడ్డాడు. పైనుంచి కింద పడిన మహేష్‌కు తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి ఆసుపత్రికి తీసుకువెళ్లేలోగా తుది శ్వాస విడిచాడు. ఆయనకు భార్య సూజాత, పిల్లలు సుధారాణి, కల్యాణి ఉన్నారు. కూలి పనికి వచ్చి ఇలా మృతిచెందడంతో తోటి కార్మికులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. మృతదేహానికి రాజాం ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం చేశారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ రాజారావు తెలిపారు.

పోక్సో కేసులో నిందితుడు సబ్‌జైలుకు తరలింపు

బొబ్బిలి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలోని గొల్లపల్లికి చెందిన సింగారపు అజయ్ ప్రేమ పేరుతో ఓ బాలికను వేధించిన కేసులో ఆదివారం అరెస్టయిన సంగతి తెలిసిందే. ఈ నిందితుడు సెల్‌టవర్ ఎక్కి హల్‌చల్ చేయడంతో పోలీసులు కిందికి దించారు. బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం పార్వతీపురం కోర్టులో నిందితుడిని హాజరు పరిచారు. బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడికి జడ్జి 14 రోజుల రిమాండ్ విధించడంతో బొబ్బిలి సబ్‌జైలుకు తరలించినట్టు డీఎస్పీ తెలిపారు.

నాటుసారా విక్రేతల బైండోవర్

రాజాం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వీటీఆర్ పేట, సంగాం, రుషింగి గ్రామాలకు చెందిన నాటుసారా విక్రేతలు ముగ్గురిపై బైండవర్ కేసులు నమోదు చేసినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ ఆర్ జైభీమ్ తెలిపారు. సోమవారం వంగర తహసీల్దార్ వద్ద వీరిని హాజరుపరచినట్టు తెలిపారు. మళ్లీ వీరు అక్రమంగా నాటుసారా తో పట్టుబడితే జైలు శిక్షతో పాటు రూ.లక్ష అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుందని తహసీల్దారు హెచ్చరించారని చెప్పారు

టీడీపీ బలోపేతానికి కృషి చేయండి: ఎమ్మెల్యే



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): టీడీపీ బలోపేతానికి అందరూ కృషి చేయాలని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు కోరారు. నగరంలోని 34వ డివిజన్ వైసీపీ అధ్యక్షుడు రామ రాజేష్‌తో పాటు 20 కుటుంబాలకు చెందిన వైసీపీ వారు ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి పసుపు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కొండ పోడు భూములకు డీకేటి పట్టాలు ఇప్పించాలి

సీతంపేట రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కొత్తూరు మండలం అడ్డంగి రెవెన్యూ పరిధిలోని కొండపోడు భూములకు డీకేటీ పట్టాలు ఇప్పించాలని గ్రామ గిరిజనులు ఏపీవో జి.చిన్నబాబును కోరారు. సోమవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఏపీవో చిన్నబాబు ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ పీజీఆర్ఎస్‌కు మొత్తంగా 58 వినతులు వచ్చాయి. వీటిలో మేకల రుణం, ట్రాక్టర్ రుణం, కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టాలని బొడ్లపాడుకు చెందిన నిమ్మక వెంకట్రావు కోరారు. రేలుగుడ్డి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని త్రినాథరావు కోరగా, కారిగూడ గ్రామంలో సీసీ రహదారి, రక్షణ గోడ నిర్మించాలని ఆరిక సన్యాసి కోరారు. పీజీఆర్ఎస్‌లో ఏపీవోతో పాటు డీడీ అన్నదొర, పీహెచ్‌వో వెంకట గణేష్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ మధుసూదనరావు, సీడీపీవో రంగలక్ష్మి, ఏటీడబ్ల్యూవో మంగవేణి పాల్గొన్నారు.

నేరెళ్లవలసకు రోడ్డు నిర్మించాలి

సాలూరు రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): నేరెళ్లవలసకు రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో కొత్తూరు వద్ద గిరిజనులు సోమవారం రాస్తారోకో చేశారు. సీపీఎం నేత చింత జోగయ్య మాట్లాడుతూ దండిగాం నుంచి నేరెళ్లవలస వరకు రోడ్డు అధ్వాన్నంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. 108 వాహనం రావడం కూడా సమస్యగా ఉందన్నారు. దీంతో దండిగాం జంక్షన్‌కు వెళ్లాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో సీతమ్మ, ప్రసాద్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన కమిటీ

చీపురుపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా అకడమిక్ మానిటరింగ్ కమిటీ సభ్యులు సోమవారం మండలంలోని వివిధ పాఠశాలలను సందర్శించారు. కమిటీలో సభ్యులుగా ఉన్న జిల్లా ఉప విద్యాశాఖాధికారి కేవీ రమణ, ఏఎంఓ జగన్, ఎంఈఓ ఎం. బూసినాయుడు తదితరులు విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకున్నారు. చీపురుపల్లి పట్టణంలోని కేజీబీవీ, అలజంగి ప్రాథమిక, కర్లాం ఉన్నత పాఠశాలలను సందర్శించి, ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. డిసెంబరు 7న అన్ని పాఠశాలల్లో మెగా పేరెంట్స్ డే నిర్వహించాలని ఆదేశించారు. ఈ కమిటీ వెంట డైట్ ఉపన్యాసకులు లుక్క రామకృష్ణ, సీఆర్‌ఎంటీలు కంది రామకృష్ణ, పి.వినోద్ తదితరులు పాల్గొన్నారు.

గిరి చేరని సంక్షేమం

(5వ పేజీ తరువాయి)

వస్తున్నారు. అప్పటికే కొందరి పరిస్థితి చాయి దాటిపోతోంది.

మొక్కుబడి చదువులే..

కొండపైన వున్న పాఠశాలలకు ఉపాధ్యాయులు వెళ్లడం లేదు. రోజూ రాకపోకలు సాగించేందుకు రహదారి లేదు. పదుల కిలోమీటర్ల దూరం రోజూ నడచి వెళ్లలేక నెలకు ఒకట్రెండు రోజులు వెళ్లి ముఖం చూపిస్తున్నారు. చదవుకున్న స్థానిక యువతకు నెలకు కొంత మొత్తం చెల్లించి వాలంటీర్లుగా పెట్టుకుంటున్నారు. మూడు నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో ప్రభుత్వ పాఠశాలలు ఉంటున్నాయి. అక్కడకు గిరిజన బాలలందరూ వెళ్లలేని దుస్థితి. విష సర్పాలు, ప్రమాద కీటకాల బారిన పడతారేమోనని తల్లిదండ్రులు భయపడుతున్నారు. గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు 2014 -2019 లో టీడీపీ సబ్‌ప్లాన్ నిధులను అందించింది. ఆ తరువాత వచ్చిన వైసీపీ ఈ నిధులను వేరే విధంగా మళ్లించింది. దీంతో గ్రామాల అభివృద్ధి అటకెక్కింది. గిరిజనులు మేకలు, గొర్రెల కొనుగోలుకు రూ.10వేల వరకు అందించిన సహాయాన్ని సైతం వైసీపీ ఆపేసింది.

విద్య, వైద్యం అందడం లేదు



రక్షిత తాగునీటి సరఫరా అంతంతమాత్రమే. క్లోరినేషన్ ఉండదు. ఏటా మలేరియా జ్వరాల బారిన పడుతున్నారు. అప్పుడప్పుడు గ్రామానికి వైద్య సిబ్బంది వస్తున్నారు. రహదారులు లేకపోవడంతో మా గిరిజన గ్రామాలకు ఎవరూ వచ్చేందుకు ఇష్టపడడం లేదు.

- జె.గౌరిష్, గిరిజన సంఘం నాయకుడు

అభివృద్ధి ఎలా ఉంటుందో చూపిస్తాం

● ఎమ్మెల్యే కోండ్రు



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోండ్రు

రాజాం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వచ్చే అయిదేళ్లలో అభివృద్ధి అంటే ఎలా ఉంటుందో చూపిస్తామని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. పార్టీ నాయకులతో సోమవారం నియోజకవర్గ నాయకులతో సమావేశం నిర్వహించారు. సభ్యత్వ నమోదులో రాజాం నియోజకవర్గం ప్రథమంగా ఉండాలని సూచించారు. ఓట్లు వేసిన ప్రజలకు మేలు చేసేందుకు నిర్దిష్టమైన ఆలోచనతో ముందుకు వెళతానన్నారు. అంతకుముందు ఎన్ఎస్‌టీపీపై చీపురుపల్లి ఆర్డీవో సత్యవతితో సమావేశమై, వివిధ అంశాలపై చర్చించారు. అనంతరం రాజాం ప్రధాన రహదారి పనులపై మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడుతో చర్చించారు. పాలకొండ రోడ్డులో తాగునీటి పైపులైన్లు పాడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆ తరువాత ఆగూరు గ్రామంలో మాజీ సర్పంచ్ నాగళ్ల అప్పలనాయుడు తల్లి మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించారు. తహసీల్దారు ఎస్.కృష్ణంరాజు, డిప్యూటీ తహసీల్దారు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

● స్థానిక టీడీపీ కార్యాలయంలో జీఎంఆర్ఐటీ విద్యార్థిని గౌతమికి ఎమ్మెల్యే కోండ్రు ఉచితంగా ల్యాప్‌టాప్‌ను పంపిణీ చేశారు. రాజాం టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ టంకాల కన్నంనాయుడు, పట్టణ ప్రధాన కార్యదర్శి శాసపు రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై సానుకూలంగా స్పందించాలి

● ఎస్పీ వకుల్ జిందాల్



ఫిర్యాదుదారుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ

విజయనగరం క్రైం, నవంబరు 25: (ఆంధ్రజ్యోతి): బాధితుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి చట్ట పరిధిలో చర్యలు తీసుకోవాలని ఎస్పీ వకుల్ జిందాల్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 35 ఫిర్యాదులు స్వీకరించారు. వీటిపై సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌తో మాట్లాడారు. ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు చేపట్టి.. న్యాయం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 35 ఫిర్యాదులు స్వీకరించారు. వీటిలో భూ తగాదాలకు సంబంధించి 4, కుటుంబ కలహాలపై 4, మోసాలకు పాల్పడినట్టు 6, ఇతర అంశాలకు సంబంధించి 21 ఫిర్యాదులు ఉన్నా యని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సౌమ్యలత, సీఐలు లీలారావు, ఆర్‌వీకే చౌదరి, ఎస్ఐ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మార్పు కోసం ప్రజలు సహకరించాలి

విజయనగరం క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సమాజంలో యువతను సన్మార్గంలో నడిపించేందుకు.. మార్పు కోసం ప్రజలందరూ సహకరించాలని ఎస్పీ వకుల్ జిందల్ కోరారు. విజయనగరం పూల్‌బాగ్ పార్కులో సోమవారం 'మార్పు కోసం మేము సైతం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఆశించిన మార్పు సాధించాలంటే ప్రజలందరూ పోలీసు శాఖకు సహకరించాలన్నారు. యువత, విద్యార్థులు చెడు వ్యసనాల నుంచి బయట పడేందుకు వీలుగా 'సంకల్పం' అనే కార్యక్రమం చేపడుతున్నట్టు తెలిపారు. రాత్రి 11 గంటల తరువాత సహేతుకమైన కారణం లేకుండా బహిరంగ ప్రదేశాల్లో తిరిగితే చట్టపరమైన చర్యలు చేపడతామన్నారు. అనంతరం స్థానికులు ఎస్పీకి బొకేలు అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, రెండో పట్టణ సీఐ టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురిపై బైండోవర్ కేసులు

బాడంగి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం అమ్మకాలు చేపడుతున్న ఆరుగురిని స్థానిక తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ కె.సుధాకర్ దగ్గర లక్ష రూపాయలకు బైండోవర్ చేశామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పి.చిన్నంనాయుడు సోమవారం తెలిపారు. ఎస్ఐ శ్రావణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



సీతానగరం: మాట్లాడుతున్న పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర



డెంకాడ: కొనుగోలు ప్రారంభిస్తున్న నెల్లిమర్ల ఎమ్మెల్యే నాగమాధవి



జామి: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్.కోట ఎమ్మెల్యే లలితకుమారి

రవాణా ఖర్చులు ప్రభుత్వానివే

● మంత్రి సంధ్యారాణి, ఎమ్మెల్యేలు
● ఉమ్మడి జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

సాలూరు రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలుకు సంబంధించి రవాణా ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. శివరాంపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె సోమవారం ప్రారంభించారు. గోనె సంచులు, లేబర్ చార్జీలు ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు. ధాన్యమిచ్చిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామన్నారు. అలాగే వరి నూర్పు యంత్రాన్ని ప్రారంభించారు. మిల్లుకు ధాన్యం తరలించడానికి జెండా ఊపి లారీని సీతానగరం పంపించారు. కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్, జేడీ రాబర్ట్‌పాల్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్పీ భంజ్‌దేవ్, పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు. ● సీతానగరం: రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని పార్వతీ పురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. పెదభోగిలి రైతుసేవా కేంద్రంలో ధాన్యం కొనుగో లు కేంద్రాన్ని ఆయన సోమవారం ప్రారంభించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారుల బారిన పడి మోసపోవద్దన్నారు. సివిల్ సప్లయ్ డీఎం కిరణ్‌కుమార్, మండల అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. ● బొబ్బిలి రూరల్: గోపాలరాయుడుపేటలోని రైతు సేవ కేంద్రంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే బేబీనాయన సోమవారం ప్రారంభించారు. వ్యవసాయ అధికారి ఎం.శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ రైతులకు ధాన్యం విక్రయంలో ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా 8978975284 నెంబరును సంప్రదించాలన్నారు. ఆర్ఎస్‌డీటీ సాయికృష్ణ, హెచ్‌డీటీవో టీకేవీఎస్ సుబ్బారావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. ● జామి: జామిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి సోమవారం ప్రారంభించారు. కూటమి నాయకు లు, అధికారులు పాల్గొన్నారు. ● భోగాపురం: రైతుల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. భోగాపురం పీఏసీఎస్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె సోమవారం ప్రారంభిచారు. ఈ సందర్భంగా పలువురు రైతులు సాగునీటి సమస్యను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక ఎస్సీబీసీ కాలనీకి చెందిన మహిళలు ఎమ్మెల్యేను కలిసి ఇంటి స్థలాల సమస్య పరిష్కరించాలని కోరారు. తహసీల్దార్ ఎం.సురేష్, ఎంపీడీవో కిషోర్‌కుమార్, ఏవో హరికృష్ణ, పీఏసీఎస్ అధికారి రామిశెట్టి జనార్దనరావు, నాయకులు పాల్గొన్నారు. ● భోగాపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కాకపోవడం చర్చనీయాంశంగా మారింది. ● డెంకాడ: చొల్లంగిపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే నాగమాధవి ప్రారంభించారు. త్వరలో రామతీర్థ సాగర్ ప్రాజెక్టును అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నానని తెలిపారు. ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వ్యవసాయ శాఖ ఏడీఏ నాగభూషణరావు, తహసీల్దారు వి.పద్మావతి, ఏవో పూడి నిర్మల పాల్గొన్నారు.



సాలూరు రూరల్: ధాన్యం లారీని ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి



బొబ్బిలి రూరల్: కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

సబ్సిడీపై చేప పిల్లలను వినియోగించుకోవాలి

● పాలకొండ ఎమ్మెల్యే జయకృష్ణ

పాలకొండ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మత్స్యకార రైతులకు సబ్సిడీపై అందిస్తున్న చేపపిల్లలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ సూచించారు. మండలంలోని తుమరాడ, తంపటాపల్లిలో మత్స్యకార రైతులకు కట్లా, రాగండి, ఎర్రమైల వంటి జాతుల చేపపిల్లలను పంపిణీ చేసి ఆయా గ్రామాల చెరువుల్లో స్వయంగా విడిచిపెట్టారు. పాలకొండ డివిజన్ మత్స్యశాఖ ఎఫ్‌డీవో డబ్బీరు గోపీకృష్ణ, సీడ్ స్టాకింగ్ కమిటీ స్పెషల్ ఆఫీసర్ మంగవేణి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. జయకృష్ణ మాట్లాడుతూ ప్రత్యేక కేంద్ర సహాయ నిధులు, గిరిజన ఉప ప్రణాళిక పథకంలో భాగంగా వంద శాతం సబ్సిడీతో పాలకొండ నియోజకవర్గంలో 546 గిరిజన మత్స్యకార రైతులకు 13 లక్షల 95 వేల 900 చేపిల్లలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఎస్‌సీఏ టూ టీఎస్‌ఎస్ పథకం ద్వారా పాలకొండ నియోజకవర్గంలో ఉన్న నాలుగు మండలాలకు చెందిన 16 ట్రైబల్ ట్యాంకుల్లో 500 మంది గిరిజన రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు. చేప పిల్లల పెంపకంలో నైపుణ్యాలపై మత్స్యశాఖ అధికారులతో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ఫిషంగ్‌నెట్స్, టూవీలర్స్, ఐస్‌బాక్సులు, నాలుగు చక్రాల వాహనాలు 90 శాతం సబ్సిడీపై అర్హత ఉన్న వారికి ఎఫ్‌సీఎస్ పథకం ద్వారా లబ్ధిదారులకు ఎంపిక చేయనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కర్నేన అప్పలనాయుడు, గండి రామినాయుడు, కిమిడి కాశీంనాయుడు, జాడ శ్రీధర్, సర్పంచ్ శోభారాణి, వెంకటనాయుడు, ప్రసాద్, దొర, జనసేన నాయకులు గర్భాన సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



చేప పిల్లలను నీటిలో విడిచిపెడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు

శృంగవరపుకోట రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కిల్తంపాలెం గ్రామంలో రూ.8లక్షలతో చేపడుతున్న సీసీరోడ్డు పనులకు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు సోమవారం శంకుస్థాపన చేశారు. ఎంపీపీ సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ ఇందుకూరి సుధారాజు, కృష్ణమహంతి పురం పీఏసీఎస్ అధ్యక్షుడు ఇందుకురి రామరాజు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటండి

శృంగవరపుకోట రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గుడివాడలో జరిగే రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో విజయనగరం జిల్లా క్రీడాకారులు ఆల్‌రౌండ్ చాంపియన్‌షిప్ సాధించాలని మాస్టర్ అథెటిక్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ఆకాంక్షించారు. సోమవారం జిల్లా నుంచి వెళుతున్న 47 మంది క్రీడాకారులకు బొడ్డవర గ్రామంలో ఉన్న తన నివాసంలో రూ.50వేలు విలువజేసే క్రీడాదుస్తులను అందించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి కృష్ణ, త్రినాథ్, పొట్నూరు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

7న తల్లిదండ్రుల సమావేశాలు

బొబ్బిలి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 7న జిల్లాలోని అన్ని హైస్కూళ్లలో మెగా పేరెంట్స్ మీటింగ్ నిర్వహించనున్నామని, బొబ్బిలి ప్రాంతంలో ఓ పాఠశాల కార్యక్రమంలో పాల్గొనాలని ఎమ్మెల్యే బేబీనాయనను డీఈవో యు.మాణిక్యంనాయుడు కోరారు. ఈ మేరకు సోమవారం బొబ్బిలి కోటకు విచ్చేసి ఎమ్మెల్యేను కలిసి, ఆహ్వానించారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-1, 2 చల్లా లక్ష్మణరావు, గొట్టాపు వాసు, హెచ్ఎంల సంఘం అధ్యక్ష కార్యదర్శులు వేణు, కొల్లి రామారావు, ఎస్.గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించండి

బెలగాం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ, గురుకుల పాఠశాల, కళాశాలల్లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు తమ సమస్యలు పరిష్కరించాలంటూ సోమవారం స్థాని క ఆర్టీసీ బస్టాండ్ కూడలి నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. తమను కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ పోస్టులకు డీఎస్సీ నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. అనంతరం పీడీ రామచంద్రరావుకు వినతిపత్రం ఇచ్చారు. సీపీఐ జిల్లా కార్యద ర్శి కె.మన్మథరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, ఇందిరా, యూటీఎఫ్ నాయకులు రమేష్, గిరిజన సంఘం నాయకులు, ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద నిరసన దీక్ష చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు

యాప్‌ల నిర్వహణకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలి

బొబ్బిలి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో ఉపాధ్యాయులకు బోధనేతర అంశాల భారం చాలా ఎక్కువగా ఉన్న నేపథ్యంలో విద్యా సంబంధిత యాప్‌ల నిర్వహణ కోసం ప్రత్యేకమైన విభాగాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరినట్టు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ తెలిపారు. సోమవారం బొబ్బిలి వచ్చిన సందర్భంగా ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. కస్తూర్బా పాఠశాలల్లో పని చేస్తున్న వారికి పనిభారం తగ్గించాలని, మోడల్ స్కూలు ఉపాధ్యాయులకు సర్వీసు రూల్స్‌ని వర్తింప చేయాలని, మున్సిపల్ ఉపాధ్యాయులకు పీఎఫ్ ఖాతాలను తెరవాలని కోరారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్లుగా నమోదు చేసుకునే గడువును వచ్చే నెల 9 వరకు పొడిగించారని తెలిపారు. ఇంతవరకు మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలో 15,360 మంది ఓటర్లుగా పేర్లను నమోదు చేసుకున్నారని, ఇంకా పదివేలమంది తమ పేర్లను నమోదు చేసుకోవల్సి ఉందన్నారు. ఈ సమావేశంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ డైరెక్టరు జేసీ రాజు, ఇతర నాయకులు బొత్స పద్మావతి, జేసీహెచ్ ప్రవీణ్‌కుమార్, బండి రమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘువర్మ

ప్రజా ఫిర్యాదులపై దృష్టి పెట్టాలి

బొబ్బిలి రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల వేదికలో అందే ఫిర్యాదులపై దృష్టి పెట్టాలని అధికారులకు కలెక్టర్ అంబేడ్కర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించారు. సోమవారం బొబ్బిలి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల అధికారులు ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని వీక్షించారు. ఇందులో భాగంగా ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందే సమస్యలపై తీసుకుంటున్న చర్యలు, రీ ఓపెన్ కేసులు తదితర అంశాలపై కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ ఎం.శ్రీను, కమిషనర్ ఎల్.రామలక్ష్మి, ఎంపీడీవో పి.రవి కుమార్, స్టేషన్ హౌస్ ఆఫీసర్ సతీష్ కుమార్, అధికా రులు పాల్గొన్నారు. ● బాడంగి, నవంబరు 25(ఆంధ్రజ్యో తి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎస్.రామకృష్ణ సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. బాడంగి పంచాయతీలో సుబ్బరాజు చెరువు నుంచి రైల్వేగేటు వరకు 2 సంవత్సరాల కిందట ఎన్ఆర్ఈజీఏ కింద మట్టి రోడ్డు నిర్మాణానికి అనుమతి లభించిందని, అయితే ఇంతవరకు పనులు చేపట్టలేదని పలువురు వినతిపత్రం అందజేశారు.

న్యూస్ బాక్స్

'ప్రేరణ ఉత్సవ్' విద్యార్థులను కలెక్టర్ అభినందన

పార్వతీపురం రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రేరణ ఉత్సవ్‌లో పాల్గొని జిల్లాకు మంచి పేరును తీసుకొచ్చిన జిల్లా విద్యార్థులను కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ అభినందించారు. ఈ మేరకు ఈ విద్యార్థులు కలెక్టర్ చాంబర్‌లో ఆయన్ని కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఇటీవల గుజరాత్‌లో జరిగిన ప్రేరణ ఉత్సవ్‌కు జిల్లా ఉంచి కేజీబీవీ విద్యార్థిని దొడ్డి తేజేస్విని, సీతానగరం మండలం బూర్జ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి బెవర హర్షవర్దన్ వెళ్లారని ఉపాధ్యాయులు కలెక్టర్‌కు వివరించారు. కేజీబీవీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సూపర్ మార్కెట్ చైర్మన్‌గా చిరంజీవిరావు

సాలూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): శ్రీశ్యామలాంబ కన్స్యూమర్స్ కో-ఆపరేటివ్ సొసైటీ (సూపర్ మార్కెట్) లిమిటెడ్ నూతన చైర్మన్‌గా మజ్జి చిరంజీవిరావు, వైస్ చైర్మన్‌గా గంటా వెంకట్రవు సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సభ్యులుగా మెంటాడ నర్సింగరావు, మెంటాడ గంగరాజు, నయిన శంకర్‌రెడ్డి, దొంతల తౌడు, అరసాడ హేమభూషణరావు, మిగడ శ్రీనువాసరావు, రాపాక నాగరాజు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని మంత్రి సంధ్యారాణి అభినందించారు.

గొర్రె పందేలపై దాడి

వీరఘట్టం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తెట్టంగి గ్రామంలో సోమవారం గొర్రె పందేలు నిర్వహిస్తున్న విషయం తెలుసుకున్న ఎస్ఐ జి.కళానిధి తమ సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. రెండు గొర్రెలను, రూ.1,220 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు పందెం రాయళ్లపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

రామభద్రపురం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ అండర్-17 బాయ్స్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఆరికతోట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారు. ఈనెల 23, 24, 25 తేదీల్లో అనంతపురం జిల్లాలో జరిగిన ఈ పోటీల్లో ఎం.జ్యోతిప్రకాష్, టి.తేజ, డి.రాఘవ పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచారు. వీరిని ఆ పాఠశాల ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు.